## క్లుప్తంగా

### కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే కిషోర్



హైదరాబాద్‌లో కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే కిషోర్‌కుమార్

**తిరుమలగిరి :** విదేశీ పర్యటనను ముగించుకొని వచ్చిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌ను మంగళవారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో తుంగతుర్తి శాసన సభ్యుడు గాదరి కిషోర్ కుమార్ కలిశారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించినందుకు కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపి పుష్పగుచ్ఛం అందజేశారు.

### పచ్చని వాతావరణమే లక్ష్యం

**సూర్యాపేట రూరల్ :** గ్రామాల్లో ఆకుపచ్చని వాతావరణం ఏర్పాటు చేయడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీఓ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం లక్ష్మీతండాలోని సంపద వనంలో మొక్కలు నాటి, పనులను పరిశీలించారు. సంపద వనాల్లో నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ వెంకన్న, ఈసీ రమేష్ పాల్గొన్నారు.

### విచారణ జరిపించాలి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

**పెన్‌పహాడ్ :** నారాయణగూడెం గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగానికి సంబంధించి గ్రామ కార్యదర్శిపై విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. మంగళవారం వారు మండల పరిషత్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. అదే విధంగా ఉమ్మడి నారాయణగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని పాదువు సంఘాల్లో వీఓఏ చేసిన అవినీతి గురించి ఏపీఎం అజయ్‌కు వినతిపత్రం అందజేసి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నారాయణ, ప్రవీణ్‌రెడ్డి, మచ్చ నాగయ్య, ఆకారపు సైదులు, నకిరేకంటి మధు, నక్క సందీప్ తదితరులు పాల్గొన్నారు.

### 13, 14 తేదీల్లో మండల స్థాయి క్రీడలు

**పెన్‌పహాడ్ :** నాగులపాటి అన్నారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 13, 14తేదీల్లో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ నకిరేకంటి రవి మంగళవారం తెలిపారు. ఈ క్రీడలను అండర్ 14, అండర్ 17 బాలబాలికలకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

### జీవ ఎరువులపై రైతులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

**చివ్వెంల :** రైతులు జీవ ఎరువులు వినియోగించి ఖర్చు తగ్గించుకుని అధిక లాభాలు పొందాలని కేవీకే శాస్త్రవేత్త కిరణ్ అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ విధానంపై సికింద్రాబాద్ లయోలా డిగ్రీ బీఎస్సీ వ్యవసాయ విద్యార్థులు మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. జీవ ఎరువుల వినియోగం వల్ల కలిగే లాభాలు వివరించారు. అనంతరం శాస్త్రవేత్త కిరణ్ మాట్లాడారు. జీవ ఎరువుల వినియోగం వల్ల పోషకాలు పెరిగి పంట దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో గాయత్రి, సౌమ్య, నిమిషా, రమ్య, శ్రీదేవి, హిమజ తదితరులు పాల్గొన్నారు.

### మూణ్నాళ్ల ముచ్చటగా 'సెంట్రల్' వెలుగులు



అంధకారంగా ఉన్న అర్వపల్లిలోని హైవే

**అర్వపల్లి :** నకిరేకల్–తానంచర్ల జాతీయ రహదారిపై అర్వపల్లి వైజంక్షన్ నుంచి జాజిరెడ్డిగూడెం, తుంగతుర్తి రోడ్లలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైట్లు మళ్లీ వెలగడం లేదు. 15 రోజుల కిందట ఈ లైట్లు పాడవగా పనిచేయని సెంట్రల్ లైటింగ్ అనే శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీంతో హైవే అధికారులు స్పందించి పాతలైట్లను తొలగించి కొత్తవి ఏర్పాటు చేసి వెలుగులను పునరుద్ధరించారు. అయితే ఈ లైట్లు మళ్లీ నాలుగురోజుల నుంచి వెలగడం లేదు. దీంతో వైజంక్షన్‌లో రెండు హైవేలు అంధకారంగా మారి ప్రజలు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు శాశ్వతంగా సెంట్రల్ లైట్లు వెలిగేలా చూడాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ప్రహరీలు లేని పాఠశాలలు

- రక్షణ గోడలు లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా ప్రభుత్వ బడులు
- పాఠశాలల ఆవరణల్లో సంచరిస్తున్న పశువులు, జీవాలు
- ఇబ్బందులు పడుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



ప్రహరీ లేని పిల్లల జెగ్గుతండా పాఠశాల





ప్రహరీ లేని జయరాంగుడితండా పాఠశాల

**చివ్వెంల :** చివ్వెంల మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు లేకపోవడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు, పాఠశాలకు రక్షణగా ఉండాల్సిన ప్రహరీలు కరువయ్యాయి. దీంతో రాత్రిళ్లు మందు బాబులు పాఠశాలలను అడ్డాగా చేసుకునా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. మండలంలో మొత్తం 56 పాఠశాలలు ఉన్నాయి. అందులో 11 పాఠశాలలకు పూర్తిస్థాయిలో ప్రహరీలు లేవు. మిగిలిన పాఠశాలల్లో పడిపోయిన సగం గోడలు, మరికొన్ని సగం నిర్మించి వదిలేసిన ప్రహరీలు ఉన్నాయి. దీంతో ఆ పాఠశాలలకు రక్షణ కరువైంది. ప్రహరీలు పాఠశాలల్లోకి పశువులు ప్రవేశిస్తున్నాయి.

**విషపురుగులు, కీటకాల సంచారం..**

చివ్వెంల మండలంలోని చాలా పాఠశాలలు గ్రామాలకు చివర ఉన్నాయి. ఆయా పాఠశాలలకు ప్రహరీలు లేకపోవడంతో విషపురుగులు, కీటకా లు సంచరిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు నిర్మించేలా చూడాలని ఉపాధ్యాయులు,స్థానికులు, విద్యార్థులు కోరుతున్నారు.

**మౌలిక వసతులు కల్పిస్తాం**

ప్రస్తుతం మొదటి విడతలో మండలంలోని కొన్ని పాఠశాలల్లో మన ఊరు–మన బడి పనులు జరిగాయి. త్వరలోనే మండలంలో మిగిలిన అన్ని పాఠశాలల్లో పనులు చేపడుతాం. రెండో విడత మన ఊరు–మన బడిలో మౌలిక వసుతులు కల్పిస్తాం.

– కె.గోపాల్‌రావు, ఎంఈఓ, చివ్వెంల

## బిల్లు పెట్టకుంటే గుణపాఠం తప్పదు



దీక్షలో మాట్లాడుతున్న ముల్కల పెల్లి రవి

**ఆత్మకూర్ (ఎస్) :** ఈ నెల 18 నుంచి జరగనున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని, లేదంటే బీజేపీ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని ఎమ్మార్పీఎస్ జిల్లా కోఇన్‌చార్జ్ ములకలపల్లి రవి మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం ఎదుట చేపడుతున్న రిలే నిరాహార దీక్షలో పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో అధికారంలోకి వస్తే వంద రోజుల్లోనే వర్గీకరణ చేస్తామని చెప్పిన బీజేపీ.. చివరకు పట్టించుకోకుండా మాదిగలను, ఉపకులాలను మోసం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మేడి కృష్ణమాదిగ, ప్రధాన కార్యదర్శి తిప్పర్తి గంగరాజు, అధికార ప్రతినిధి మిర్యాల చిన్ని, ఆరెంపుల వంశీ, నవీన్, తిప్పర్తి అరుణ్ తేజ్, ములకలపల్లి నజీర్, యాతాకుల శ్రీశైలం, బొడ్డు శ్రీను, ముల్కలపెల్లి సైదులు, బొడ్డు నజీర్, యాతాకుల కృష్ణయ్య.

## అన్ని పార్టీలు సామాజిక న్యాయం పాటించాలి

**తుంగతుర్తి :** దేశంలో ఉన్న పార్టీలన్నీ సామాజిక న్యాయం పాటించాలని ధర్మ సమాజ్ పార్టీ నాయకుడు నరేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్‌ల దిష్టిబొమ్మలను దహనం చేసి మాట్లాడారు. రాష్ట్రంలో 93శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఉండగా ఏడు శాతం కూడాలేని అగ్రకులాలు ఆయా పార్టీలకు నాయకత్వం వహించడం సరైంది కాదని అన్నారు. అన్ని పార్టీలు అణగారిన కులాలకు నాయకత్వం అప్పజెప్పాలని కోరారు. ప్రభుత్వంలో ముఖ్యమంత్రి స్థానాన్ని దళితుడికి ఇవ్వాలని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో 93శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కేటాయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ పార్టీ నాయకులు విజయరామరాజు, నాగార్జున, వినీత్, నాగరాజు, శ్రీనివాస్, వీరేష్, అనుదీప్, భాస్కర్, మల్లేష్, దిలీప్ పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన ర్యాలీ



సిద్ధిసముద్రంలో ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

**తిరుమలగిరి :** సిద్ధిసముద్రం గ్రామంలో ప్లాస్టిక్ నియంత్రణపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. శ్రీ పోతన గోశాల నిర్వాహకులు, ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ గోశాల ఫెడరేషన్ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ మాట్లాడారు. ప్లాస్టిక్ నియంత్రణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ప్లాస్టిక్ వాడకం వల్ల వాతావరణ కాలుష్యం పెరుగుతుందని తెలిపారు. గోనె సంచులు వాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోశాల అధ్యక్షుడు దేవేందర్‌నాయక్ పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ టీచర్ల డిమాండ్లు నెరవేర్చాలి



సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీలు

**పెన్‌పహాడ్ :** అంగన్‌వాడీ టీచర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ భాస్కరమ్మ అన్నారు. అంగన్‌వాడీలు చేపట్టిన రెండవ రోజు సమ్మెలో మంగళవారం వారు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అంగన్‌వాడీలకు కనీస వేతనం ఇవ్వకుండా వెట్టిచాకిరీ చేయిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, సెంటర్ అద్దెలు చెల్లించలేక నానా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ, గుంజా వెంకటేశ్వర్లు, కొండమీది రాములు, అంగన్‌వాడీ టీచర్స్ రణపంగ లలిత, మామిడి వసంత, లక్ష్మి, జానీబేగం, జయమ్మ, మంజుల, వెం

## రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి



గ్రామ సభలో పాల్గొని మాట్లాడుతున్న ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్

**అర్వపల్లి :** రాజకీయాలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్ అన్నారు. మండల పరిధిలోని కుంచమర్తిలో మంగళవారం నిర్వహించిన గ్రామసభలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ అధిక నిధులు కేటాయిస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు వీధుల్లో కల్వర్టులు నిర్మించాలని తీర్మానించారు. ఈ సభలో సర్పంచ్ ఉగ్గం ఉపేంద్రలింగరాజు, ఉపసర్పంచ్ సయ్యద్, పంచాయతీ కార్యదర్శి రవీందర్‌రెడ్డి, వార్డు సభ్యులు మౌనిక, భాగ్యమ్మ, సుహాసిని, శ్రీను, వీరస్వామి, జానిపాష, ఫీల్డ్ అసిస్టెంట్ ఏడుకొండలు, స్వరూప, గ్రామస్తులు పాల్గొన్నారు.

## లక్ష్మమ్మ ఆశయ సాధనకు కృషి చేయాలి



లక్ష్మమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్లపల్లి నాగరాజు

**పెన్‌పహాడ్ :** సీపీఎం సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ ధనియాకుల లక్ష్మమ్మ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తాళ్లపల్లి నాగరాజు అన్నారు. మంగళవారం నాగులపాటి అన్నారం గ్రామంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ సర్పంచ్‌గా పని చేస్తున్న క్రమంలో బలహీన వర్గాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసిన వ్యక్తి లక్ష్మమ్మ అని అన్నారు. సీపీఎం సీనియర్ నాయకురాలుగా మహిళా సమస్యలపై, దళితుల సమస్యలపై నిరంతరం పోరాడిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ భువనగిరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బుర్ర అనిల్, వనం రాజు, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బాణోతు వినోద్, ప్రజాగాయకుడు పాటల గోపి, నాయకులు పాల్గొన్నారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



తిమ్మాపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

**అర్వపల్లి :** తిమ్మాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం డి. చాంప్లా, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు బింగి శ్రీనివాసులు ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు పొందారు. దీంతో వారిని మంగళవా రం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యా ర్థులు ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సయ్య, స్నేహలత, కృష్ణయ్య, రవీందర్, కొండ వెంకన్న, మురళి, ఎస్. వెంకన్న, సీన య్య, సునంద, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

## ఇండియన్ స్వచ్ఛత లీగ్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

**సూర్యాపేట :** ఇండియన్ స్వచ్ఛత లీగ్ 2.0 కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 17న విద్యార్థులతో మినీ ట్యాంక్ బండ్ (సద్దుల చెరువు)పై క్లీనింగ్ క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి తెలిపారు. మంగళవారం పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దుర్గాప్రసాద్, మెప్మా పీడీ రమేష్ నాయక్, స్వచ్ఛ బ్రాండ్ అంబాసిడర్ పెద్దిరెడ్డి గణేష్, కౌన్సిలర్ తాహెర్ పాష, అనంతుల యాదగిరి,

## మందుబాబులకు అడ్డాగా ఆలయ ఆవరణ!



ఆలయ కళామండపం వద్ద పడేసిన బీరుసీసాలు

**అర్వపల్లి :** అర్వపల్లిలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి ఆలయం ఆవరణలో మందుబాబులు తరచూ మద్యం సేవించి ఖాళీ సీసాలను అక్కడే పడేసి వెళ్తున్నారు. సోమవారం రాత్రికూడా మద్యం సేవించి ఖాళీ సీసాలను దేవాలయ ఆవరణతో పాటు ఆలయం ఎదుట ఉన్న కళామండపంపై, చుట్టూ చిందరవందరగా పడేశారు. మందుబాబులు ఆలయ పవిత్రతకు భంగం కల్గిస్తున్నారని ఆలయానికి వచ్చే భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో మాక్ పోలింగ్



తిరుమలగిరి : అనంతారం మోడల్ స్కూల్‌లో మాక్ పోలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు



అర్వపల్లి కేజీబీవీలో..



నాగారం : పసునూరు మోడల్ స్కూల్లో ఓట్లు వేయడానికి బారులుదీరిన విద్యార్థుల

**తిరుమలగిరి :** తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని అనంతారం మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు మంగళవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రిటర్నింగ్ ఆఫీసర్, ప్రిసైడింగ్ ఆఫీసర్, పోలీస్ ఆఫీసర్, పోలింగ్ ఏజెన్సీగా బాధ్యతలు నిర్వహించారు. ఎన్నికల్లో పోటీ చేసిన విద్యార్థులు గెలుపొందడానికి ప్రచారం చేసి, ప్రసంగించి అందరినీ ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వేముల బాలరాజు, మాధురి, జానయ్య, సంజీవ్‌కుమార్, హేమలత పాల్గొన్నారు.

**అర్వపల్లి :** ఎన్నికల ప్రక్రియ, ఎన్నికల హక్కులపై విద్యార్థులకు అవగాహన కల్పించుటకై మంగళవారం అర్వపల్లిలోని కేజీబీవీలో చునావ్ పాఠశాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటింగ్ విధానం, ఓటు వేసే ప్రక్రియను బాలికలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓ నాగరాణి, సీఆర్‌టీలు స్వప్నమేరి, అరుణ, సరిత, విజయ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

**నాగారం :** మండల పరిధిలోని పసునూరు మోడల్ స్కూల్లో విద్యార్థులకు ఓటుహక్కుపై అవగాహన కల్పించేందుకు మంగళవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎమ్మెల్యే, ఎంపీగా ఎన్నికల్లో పోటీ చేశారు. బ్యాలెట్ బాక్స్‌లను ఏర్పాటుచేసి, విద్యార్థులకు బ్యాలెట్ పత్రాలను పంపిణీ చేసి ఓట్లు వేయించారు. కొంతమంది విద్యార్థులు పోలింగ్ సిబ్బంది పాత్ర పోషించి ఓటు వేసేందుకు వెళ్లిన విద్యార్థులకు సిరా గుర్తులు వేశారు. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కుంట రమేష్, ఉపాధ్యాయులు ఎం.రమేష్, శ్రీనివాస్, భూతం యాకమల్లు, రాజేందర్, కార్తీక్, గణేష్, మానస వీణ, రాజ్ కుమార్, కరుణాకర్, హరిత, సెరీనా, రోజా విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు డిక్షనరీల పంపిణీ



డిక్షనరీలు అందిస్తున్న సంఘం సభ్యులు



నాగారం : విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందజేస్తున్న కెనరా బ్యాంకు సిబ్బంది

**సూర్యాపేట :** పట్టణంలోని హనుమానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఎన్.సుదర్శన్‌రెడ్డి, అరుణల ఆర్థిక సహకారంతో రూ.20వేల విలువ గల 150 ఇంగ్లిష్, తెలుగు డిక్షనరీలను మంగళవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.సీతారామయ్య మాట్లాడారు. పేద విద్యార్థులు విద్యలో మరింతగా రాణించేందుకు సుదర్శన్‌రెడ్డి దంపతులు అవసరమైన సహాయ సహకారం అందించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్క సభ్యుడు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పన కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాంబాబు, కోశాధికారి హమీద్‌ఖాన్, ఉపాధ్యక్షుడు తంగెళ్ల లక్ష్మీకాంతరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి సుదగాని నాగేశ్వర్‌రావు, కె.సురేందర్‌రెడ్డి, తిలక్‌నగర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థులకు ప్రోత్సాహకం**

**నాగారం :** మండల పరిధిలోని ఈటూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో 2022–23 విద్యా సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఎక్కువ మార్కులు సాధించిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో మంగళవారం నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. 5, 6, 7 తరగతులు చదువుతున్న విద్యార్థులు ఏల మహేష్, పేరాల వినయ్, పేరాల అశ్వినిలకు ఒక్కొక్కరికి రూ.5,000 చొప్పున నగదు చెక్కులు అందజేశారు. అనంతరం కెనరా బ్యాంక్ మేనేజర్ అనంత గుప్తా మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో చదివే పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు కెనరా బ్యాంక్ సౌజన్యంతో ఆర్థికసాయం అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంక్ సిబ్బం

## పెరిగిన పంటల సాగు

- జాజిరెడ్డిగూడెం మండలంలో 23వేల ఎకరాల్లో సాగవుతున్న వివిధ పంటలు
- గతంలో కన్నా ఈసీజన్‌లో 2వేల ఎకరాల్లో పెరిగిన విస్తీర్ణం



సీతారాంపురం సమీపంలో సాగులో ఉన్న వరి

**అర్వపల్లి :** జాజిరెడ్డిగూడెం మండలంలో గతంతో పోలిస్తే ప్రస్తుత సీజన్‌లో పంటల సాగు విస్తీర్ణం పెరిగింది. వర్షాలు సమృద్ధిగా కురవడం, గోదావరి జలాలు కావాల్సిన మేర వస్తుండటంతో అన్నదాతలు పంటల సాగును పెంచారు. బోళ్లు, రాళ్లతో నిండిన భూములను సైతం రైతులు ఈసారి శుభ్రం చేసి పంటలకు అనువుగా తీర్చిదిద్ది సాగుచేస్తున్నారు.

**జాజిరెడ్డిగూడెం మండలంలో ఇలా..**

జాజిరెడ్డిగూడెం మండలంలో వానాకాలం సీజన్‌నందు 20 నుంచి 21 వేల ఎకరాల్లో పంటలు సాగవుతుంటాయి. ఈ సీజన్‌లో మరో రెండు వేల ఎకరాల్లో అదనంగా పంటలు సాగయినట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. మండలం వ్యాప్తంగా ప్రస్తుతం 20 వేల ఎకరాల్లో వరి నాట్లు వేశారు. అలాగే ఈసారి పత్తి 2,000 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. 250 ఎకరాల్లో మిర్చి పంట సాగవుతుంది. అలాగే ఆయిల్‌పాం 100 ఎకరాల్లో, కంది సుమారు 50 ఎకరాల్లో సాగుచేస్తున్నారు.

**ఈసారి పంటలకు ఢోకా లేదు**



వర్షాలకు తోడు ఈసారి సీజన్ మొదటి నుంచి గోదావరి జలాలు వస్తుండటంతో పంటలకు ఎలాంటి ఢోకా ఉండదు. గోదావరి జలాల వల్ల 10 ఎకరాల వరకు పంటలు సాగు చేస్తున్నాం.

– సుంకరి వెంకన్న, రైతు, సీతారాంపురం

**పంటలు చేతికొచ్చే వరకు..**



గోదావరి జలాలు ఈ సారి పంటల సాగు ప్రారంభం నుంచే విడుదల చేశాం. పంటలు రైతుల చేతికొచ్చేవరకు నీటిని ఇస్తాం. గోదావరి జలాలతో పంటల సాగు పెరిగింది. బీడు భూములు, గుట్టలు, బోళ్లు సైతం పొలాలుగా మారుతున్నాయి. రైతులు కాలువలకు నష్టం కలిగించకుండా నీటిని పంటలకు వాడుకోవాలి.

– సత్యనారాయణ, బయ్యన్నవాగు, డీఈఈ

## బీఆర్‌ఎస్ కార్యకర్తలకే సంక్షేమ పథకాలు

**మోతె :** ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలకే అందుతున్నాయని డీవైఎఫ్‌ఐ మండల అధ్యక్షుడు ఎలుగు మధు చేగువీర ఆరోపించారు. మంగళవారం మండల పరిధిలోని రావిపహాడ్ గ్రామంలో నిర్వహించిన డీవైఎఫ్‌ఐ గ్రామ శాఖ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గృహలక్ష్మి, దళితబంధు, డబుల్ బెడ్ రూం ఇళ్ల పథకాలలో బీఆర్‌ఎస్ కార్యకర్తలే లబ్ధి పొందడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ నాయకులు శీలం సతీష్, బాపనపల్లి నాగయ్య, ఎడ్ల సైదులు, తదితరులు పాల్గొన్నారు.

### సభను జయప్రదం చేయాలి

**నూతనకల్ :** కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 17న హైదరాబాద్‌లో నిర్వహించే విజయభేరి సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి కార్యకర్తలను కోరారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. బహిరంగ సభకు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు ముఖ్యఅతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు. సభకు ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

### 15న స్పాట్ అడ్మిషన్లు

**తిరుమలగిరి :** అనంతారం మోడల్ స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం చదివే విద్యార్థుల కోసం ఈనెల 15న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వేముల బాలరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, సీఈసీల్లో మిగిలి ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

### లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

**తిరుమలగిరి :** తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మందడి పద్మారెడ్డి, కార్యదర్శి కందుకూరి లక్ష్మయ్య, కోశాధికారి సురేష్‌బాబు, రామచంద్రం గౌడ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న నాయకులు

**తిరుమలగిరి :** మండల పరిధిలోని తాటిపాములకు చెందిన కొడిదెల అంజికి రూ.70 వేల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు మంజూరైంది. ఆ చెక్కును మంగళవారం తాటిపాములలో ప్రజాప్రతినిధులు లబ్ధిదారుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కొర్నె ప్రవీణ్, ఉప సర్పంచ్ నాయిని మల్లయ్య, ఉపేందర్, రమేష్, పురుషోత్తం, దయా యాదవ్, రాము, చంద్రనారాయణ, రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

**కోదాడరూరల్ :** పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చందర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని వాగ్దేవి కళాశాలలో స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని విద్యార్థులతో సంతకాలు సేకరించి మాట్లాడారు. సీఎం కేసీఆర్ విద్యారంగాన్ని పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రమీల, సుశీల, గౌతమి, షర్మిల, రాఘవ్, ప్రశాంత్, సుధాకర్, ప్రభ ఉన్నారు.